క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

హన్వాడ: మండలంలోని పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో స్థానిక కార్మికులతో సమావేశం నిర్వహించారు. పాలమూరు- రంగారెడ్డి పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని పద్మావతి కాలనీలో 11 కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ 3 ఏఈ భగవంతయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పద్మావతి కాలనీ, శ్రీనివాస కాలనీ, అయ్యప్పగుట్ట ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాక విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నవాబుపేట పరిధిలో..

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, కొండాపూర్, గురుకుంట , రుక్కంపల్లి, ధరిపల్లి, హాజిలాపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు గురువారం వివరించారు. నవాబుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు నేపథ్యంలో విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు ఏడీ ధావ్యానాయక్ వివరించారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

నేటి నుంచి వాసవీమాత జయంతి వేడుకలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆలయంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలు శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళీకృష్ణ తెలియజేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజున ఉదయం 8గంటలకు మహాగణపతిపూజ, సర్వతోభద్ర మండప, యోగినిమండప, నవగ్రహపూజలు, 9.30గంటలకు చండీయాగం, సాయంత్రం 5.30గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ జరగనున్నట్లు వివరించారు. గద్వాల చంద్రశేఖర్‌రావుతో భక్తిసంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా శనివారం ఉదయం 6గంటల నుంచి వాసవీమాత మూలవిగ్రహానికి క్షీరాభిషేకం, నవవిధ ఫలరసాభిషేకం, 10గంటలకు కన్యకాపరమేశ్వరి మాత వ్రతం, 12.30గంటలకు డోలారోహణం, వడిబియ్యం , సాయంత్రం 5గంటలకు వాసవీమాత ఊరేగింపు, నందికోళ్లసేవ, గ్రామోత్సవం, మహామంగళహారతి తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిస్తామన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు



హన్వాడ: మహబూబ్‌నగర్ నుంచి హన్వాడకు వచ్చే 33 కేవీ లైన్ కింద.. రహదారి పక్కన గతంలో మొక్కలు నాటడంతో అవి ప్రస్తుతం ఏపుగా పెరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో చేసేది లేక విద్యుత్ సిబ్బంది ఈదురు గాలులు వీచిన ప్రతీసారి సరఫరాను నిలిపివేయడం పరిపాటిగా మారింది. తాజాగా మంగళ, బుధవారాల్లో ఈదురుగాలుల కారణంగా విద్యుత్‌లైన్‌లపై ఉన్న చెట్లు కొమ్మలు విరిగిపడడంతో సరఫరా నిలిచిపోయింది. గురువారం సైతం సరఫరాలో సమస్య తలెత్తింది. దీంతో సిబ్బంది వృక్షాల కొమ్మలను తొలగించే పనులు చేపట్టారు. ఈ మేరకు సుమారు 2–3గంటలు సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో వ్యాపారస్తులు, కార్యాలయాల్లో అధికారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్రమైన హజ్‌యాత్రలో యాత్రికులు రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలని... రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. హజ్‌యాత్రకు వెళ్తున్న వారిని హైదరాబాద్‌లోని హజ్‌హౌజ్ ప్రాంగణంలో గురువారం కలిశారు. యాత్రికులతో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్న ప్రత్యేక బస్సును కొత్వాల్ తదితరులు సాగనంపారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు హజ్‌యాత్రికులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హజ్‌యాత్ర చేయాలని ప్రతి ముస్లిం కోరుకుంటాడని, ఆ అదృష్టం కొంతమందికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం తరపున అనేక సేవలు అందించినట్లు వివరించారు.



దాహం తీరినట్లే..!

నీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు



జూరాల ప్రాజెక్టులో బ్యాక్‌వాటర్

- రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కర్ణాటక సానుకూల స్పందన
- నారాయణపూర్ నుంచి జూరాలకు 1.9 టీఎంసీల నీటి విడుదల
- జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



జూరాల ఎడమ కాల్వ వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి పంప్‌హౌజ్

అమరచింత: ఉమ్మడి పాలమూర్ జిల్లా వ్యాప్తంగా తాగునీటిని అందిస్తున్న జూరాల ప్రాజెక్టు జలాశయం రోజురోజుకు తగ్గుముఖం పడుతుంది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎగువన ఉన్న నారాయణపూర్ డ్యాం నుంచి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరింది. దీంతో స్పందించిన కర్ణాటక ప్రభుత్వం అడిగిన రెండు టీఎంసీల నీటిని ఇవ్వలేమని, ప్రస్తుతానికి 1.9 టీఎంసీల నీటిని విడుదల చేసింది. దీంతో ఐదు రోజుల నుంచి నెమ్మదిగా జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న నీటితో రోజురోజుకు ఇన్‌ఫ్లో పెరిగిపోతుండటంతో ఇక వేసవిలో తాగునీటి కష్టాలు గట్టెక్కినట్లేనని అధికారులు తెలియజేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు తాగునీటితో పాటు సాగు, విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని అందించే ప్రాజెక్టుగా పేరుగాంచింది. కాని వరదలు వచ్చిన ప్పుడు అత్యధికంగా నీటిని నిల్వ ఉంచుకోలేని పరిస్థితిలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో కేవలం 11 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచుకుని, మిగిలిన నీటిని దిగువకు వదులుతున్న పరిస్థితులు దాపురించాయి.

జూరాలపై ఆధారపడిన తాగునీటి పథకాలు..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీటిని అందించేందుకు శ్రీకారం చుట్టారు. రామన్‌పాడ్ రిజర్వాయర్‌తో పాటు జూరాల ప్రాజెక్టుతో మొత్తంగా 17 తాగునీటి పథకాలకు నిత్యం నీటిని అందిస్తున్నారు. ఆత్మకూర్, అమరచింత, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, దేవరకద్ర, మహబూబ్‌నగర్, షాద్‌నగర్‌కు తాగునీటిని అందించే పథకాలను వీటిపై ఏర్పాటు చేశారు. ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకున్న అధికారులు జూరాల నుంచి ఆయకట్టుకు కేవలం వారబంది ద్వారా పంటల సాగుకు నీటిని అందిస్తున్నారు. గతేడాది వర్షాలు అనుకున్న విధంగా కురవకపోవడంతో యాసంగిలో జూరాల ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. అయినా తాగునీటిని వేసవి పూర్తినాటికి అందిచలేమని గ్రహించిన ప్రాజెక్టు అధికారులు, విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎగువన కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు తాగునీటి అవసరాలకు నీటిని నారాయణపూర్ డ్యాం ద్వారా విడుదల చేసింది.

ప్రభుత్వం చొరవతోనే..



రాష్ట్ర ప్రభుత్వం చొరవతోనే ఎగువన ఉన్న కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ డ్యాం నుంచి 1.9 టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేసింది. వేసవిలో ప్రజలకు పూర్తిస్థాయిలో నీటి ఇబ్బందులు కలుగకుండా జూరాలలో నీటి నిల్వను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం జూన్ చివరి నాటికి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– జగన్మోహన్, ఈఈ

సమస్య పరిష్కారానికి..



జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన తాగునీటి పథకాలకు వేసవి కాలం పూర్తయ్యే నాటికి నీటిని అందించాలనే ఉద్దేశంతో సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సమస్యను నివేదించాం. కర్ణాటక ప్రభుత్వానికి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కోరాం. దీంతో కర్ణాటక ప్రభుత్వం 1.9 టీఎంసీల నీటిని విడుదల చేసింది.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మక్తల్

మరోసారి చర్చలు విఫలం



చర్చలు చేస్తున్న ఫ్యాక్టరీ యజమానులు, కార్మిక సంఘాల నాయకులు

చిన్నచింతకుంట: బీడీ కార్మికుల కనీస వేతన కూలి పెంపుపై బీడీ కార్మిక సంఘాల నాయకులకు, ఫ్యాక్టరీల యజమానులకు గురువారం మహబుబ్‌నగర్‌లో జరిగిన చర్చలు మరోసారి విఫలమయ్యాయి. వెయ్యి బీడీలు చుడితే కనీస వేతన కూలి రూ. 350 చెల్లించాలని ఈ సందర్భంగా సంఘాల వారు డిమాండ్ చేశారు. కాగా ఇదివరకు చెల్లించే రూ.207, పీఎఫ్‌తో కలిపి రూ.227 చెల్లిస్తామని యజమాన్యం తెలిపింది. కాగా యజమాన్యం ఒప్పుకోలేదని ఐఎఫ్‌టీయూ నాయకుడు జీఎన్ దేవదానం తెలిపారు. కాగా చర్చలను వాయిదా వేసి ఈ నెల 27న మళ్లీ చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం సుధాకర్‌రెడ్డి, సోహెల్, జియా, వాసిమ్, వజీర్‌బాబ్, అఖిఫ్, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, టీఎఫ్‌టీయూల నాయకులు కోళ్ల వెంకటన్న, కొండన్న, సామేల్, అరుణ్‌కుమార్, సి. వెంకటేష్, వేణుగోపాల్, మహిమూద్, బుచ్చన్న, యాదగిరి, ఖలీల్, షాంసుందర్, అబ్రహంలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆరాధన మహోత్సవాలు



భజన పోటీల్లో పాల్గొన్న భక్తులు



అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి, అమ్మవారు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామివారి ఆరాధన, గురుపూజా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుప్రభాతం నామసంకీర్తన, ధ్వజారోహణం, పుణ్యాహవాచనం, కలశస్థాపన, అభిషేక, గణపతిపూజ పూజలు నిర్వహించారు. శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి, శివలింగ, ఆంజనేయస్వామివార్లకు అభిషేకం, విశేష పూజలు, రథోత్సవం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, అధ్యక్షుడు ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ తెలిపారు. కాగా మొదటి రోజు నిర్వహించిన భజన పోటీల్లో దుర్గాభవానీ మహిళా భజన మండలి (మహ్మదాబాద్), శ్రీవీరాంజనేయస్వామి భజన మండలి (చిన్నరాజమూర్), తిరుమలనాథస్వామి భజన మండలి (గొండ్యాల), శ్రీఆంజనేయస్వామి భజన మండలి (అమిస్తాపూర్), శ్రీశివాంజనేయస్వామి భజన మండలి (కొండాపూర్), శ్రీఆంజనేయస్వామి భజన మండలి (భూత్పూర్), శ్రీవీరాంజనేయ భజన మండలి (గురుకుంట), శ్రీదాసాంజనేయస్వామి భజన మండలి (కొత్తపేట), శ్రీమారుతి కళాభజన మండలి (నవాబ్‌పేట), శ్రీఆంజనేయస్వామి భజన మండలి (గార్లపహాడ్) బృందాలు పాల్గొన్నాయి. న్యాయనిర్ణేతలుగా బొల్లంపల్లి కృష్ణయ్య, కె.జానకీరామాచారి, వెంకటాచలపతి వ్యవహరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. మహోత్సవాల్లో దేవస్థానం అభివృద్ధి కమిటీ కోశాధికారి నారాయణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షులు మణికొండ నర్సింహాచారి, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షులు సత్తయ్యాచారి, కార్యదర్శి రమేష్, భీమాచారి, ఎన్.భాగన్నగౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు



ఉదండాపూర్ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

- అవకాశం ఉన్నచోటే మొక్కలు నాటించనున్న అధికారులు
- మండలంలో 1.95 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం

జడ్చర్ల టౌన్: మండలంలోని 45 గ్రామపంచాయతీల్లో హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గ్రామాల్లో అవకాశం ఉన్నచోట మాత్రమే మొక్కలు నాటేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండటంతో ఈ ఏడాది కేవలం 1.95 లక్షల మొక్కలు నాటేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. గత ఏడాది 5లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యంగా ఉండగా వాటిలో 50శాతంకు పైగా ఎండిపోయాయి. గత ప్రభుత్వం హయాంలో పెద్దమొత్తంలో మొక్కలు నాటేలా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అదే సంఖ్యలో నాటించారు. కానీ వర్షాభావ పరిస్థితుల కారణంగా వాటిని సంరక్షించే అవకాశం లేకుండా పోయింది. అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఈ ఏడాది గ్రామంలో ఎన్ని మొక్కలు నాటేందుకు అవకాశం ఉందో ముందే గుర్తించి అక్కడే నాటి వాటిని పరిరక్షించాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు గ్రామాల్లో మొక్కల డిమాండ్‌ను ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బంది లెక్కిస్తున్నారు. అందులో భాగంగానే మండలానికి నిర్దేశించిన లక్ష్యం ఆధారంగా ఏ గ్రామంలో ఎన్ని నాటాలనే దానిపై లెక్కలు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా సమావేశాలు నిర్వహించకుండా కేవలం మేట్‌లు, ఎఫ్‌ఏల ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీకి చెందిన పదిశాతం భూముల్లో అధికంగా మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పై మొక్కలతోపాటు 51 ఎకరాల్లో ఉద్యానవన శాఖ ద్వారా మామిడి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ లాంటి పండ్లతోటలు పెంచాలని నిర్దేశించారు. మండలంలోని 45 గ్రామపంచాయతీల్లోనూ 51 ఎకరాలపై సర్వే నిర్వహిస్తున్నారు.

పదిశాతం భూముల్లో నాటేలా ప్రణాళికలు

హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది నిర్దేశించిన 1.95 లక్షల మొక్కలను అవకాశం ఉన్నచోట నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. ఎఫ్‌ఏలు, మేట్‌ల ద్వారా ఆయా గ్రామపంచాయతీల్లోని వెంచర్లలో ఉన్న 10 శాతం భూములను పరిశీలిస్తున్నాం . అలాగే ఉద్యానవనశాఖ ద్వారా మామిడి, బత్తాయి, దానిమ్మ, నిమ్మలాంటి పండ్ల మొక్కలు 51ఎకరాల్లో నాటాలని లక్ష్యం నిర్దేశించారు. దానికి అనుగుణంగా భూమి ఎంపిక ప్రక్రియ జరుగుతోంది.

–విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఓ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, జడ్చర్ల

వేతనాలు పెంచాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి 12శాతం వేతనాలు పెంచాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యతో కలిసి నాన్‌టీచింగ్ సంఘం నాయకులు విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేషంకు వినతిపత్రం అందజేశారు. గతంలో 12శాతం వేతనం పెంచి గత మూడు సంవత్సరాలుగా పెంచడం లేదని అన్నారు. దీంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే చర్యలు తీసుకుని వేతనం పెంచే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1న షణ్ముఖ శర్మ ప్రవచనం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో జూన్ 1న ప్రముఖ భాష్యకారులు, ప్రవచనకారులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు.. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ గురువారం తెలియజేశారు. ప్రవచనానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ప్రవచన కార్యక్రమంలో పాల్గొని భగవత్, గురువుల కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

డాక్టరేట్ ప్రదానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ మైక్రోబయోలజీ విభాగంలో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్న విజయ్‌కుమార్ గురువారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఆయన కొనేళ్లుగా పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో ' రెమిడియేషన్ స్టడీస్ ఇన్ ఫిజికో కెమికల్ అండ్ మైక్రోబయోలాజికల్ అనాలసిస్ ఆఫ్ వాటర్ ఫర్ రీస్టొరేషన్ ఆఫ్ పెద్ద చెరువు మహబూబ్‌నగర్' అనే అంశంపై రీసెర్చ్ చేశారు. అనంతరం ఆయన పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు గానూ యూనివర్సిటీ అధికారులు ఆయనకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, అధ్యాపకులు పిండి పవన్‌కుమార్, కంట్రోలర్ జార్‌కుమార్ తదితరులు అభినందించారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మంజూరైన వివిధ పనులు గడువు (జూన్ 10) లోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని గుర్తించామన్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్ల, మరికొన్ని చోట్ల తరగతి గదుల మరమ్మతు, ఇంకొన్ని చోట్ల తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. వీటిలో ఇప్పటివరకు 22 పనులు ప్రారంభం కాగా, మిగతావి వెంటనే చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంఈ యు.బస్వరాజ్, డిప్యూటీ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

చిన్నచింతకుంట: రైతులు సాగు చేసుకునేందుకు జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా తెలిపారు. చిన్నచింతకుంట రైతు ఆగ్రోసేవ కేంద్రం–1,2లో, అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. 30 కేజీల జీలుగ బస్తాకు రూ. 1,116, అదేవిధంగా 40 కేజీల జనుము బస్తాకు రూ. 1,448 చెల్లించాలన్నారు. దీంతో పాటు రైతు పట్టాదార్ పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను అందజేయాల్సి ఉంటుందన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



దేవరకద్రలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



జడ్చర్లలో..

దేవరకద్ర: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ .. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతులు పండించిన వరి ధాన్యం వెంటనే కొనాలని, క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ధర్నా సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, కొండారెడ్డి, కరణంరాజు, దొబ్బలి అంజనేయులు, బాల్‌రాజు, శివానంద్, కుర్వరాందాసు, కేబీఆర్‌గౌడ్, యుగంధర్, నరేష్, హన్మంతు, యాదయ్య, కృష్ణారెడ్డి, గౌస్, పాష, అంజి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వరి ధాన్యం వెంటనే కొనాలని, క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు.సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రామ్మోహన్, రంజిత్ బాబు, ప్రణీల్ చందర్, ఇమ్ము, నాగిరెడ్డి, లత, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తత అవసరం



నవాబుపేటలో..



మిడ్జిల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నవాబుపేట: డెంగీపై అప్రమత్తత అవసరమని.. ప్రజలు నిరంతరం పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలో డెంగీ జాతీయ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. డెంగీ వచ్చిందని అనుమానం కలిగితే వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. శరభలింగం, రాఘవేందర్, అవినాష్, శ్రీనివాస్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి శివకాంత్, సీహెచ్ఓ రాము, సూపర్ వైజర్ మరియమ్మ, సిబ్బంది దేవయ్య, సంపత్‌కుమార్, గీతా తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

జడ్చర్ల టౌన్: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీసేన నియోజకవర్గ కార్యదర్శి రామస్వామి, మండల కార్యదర్శి జి. నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం బీసీసేన కార్యాలయంలో నిర్వహించిన మండల ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టాలన్నారు. అదేవిధంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ విషయంలో బీసీలంతా ఏకతాటిపైకి రావాలని, పార్టీలకు అతీతంగా రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు. అలాగే కులగణన హామీ నెరవేర్చేలా అన్ని వర్గాలు ప్రభుత్వం మీద వత్తిడి తెద్దామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శివరాములు, మండల నాయకులు పాల్గొన్నారు.

బాలలరక్షణ, చట్టాలపై అవగాహన

మక్తల్: మండలంలోని కర్నిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద గురువారం సంస్థ కో–ఆర్డినేటర్ విజయకుమార్ బాలలరక్షణ, చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ గురించి వివరించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. గ్రామాల్లో ఆడపిల్లలను మధ్యలోనే చదువు మాన్పించొద్దని, బాల్యవివాహాలు చేయొద్దని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తే 1098కు కాల్‌చేయాలని కోరారు.